# గడ్డి

వంకలోని బండ్ల బాటలో-

డొక్క లాచ్చుకొని పోయిన బండెద్దులు రాళ్ళబండిని లాగలేక లాగుతున్నాయి. చొంగ కారుస్తున్నాయి. బండి చక్రాలు యిసుకలో బరువుగా తిరుగుతున్నాయి.

బాటమధ్య పడివున్న నాలుగైదు వగుడాకులనూ, చొప్పదంట్లనూ యెద్దులు చూశాయి. నీరసంగా మోరలు కిందికి వంచాయి. నాలుకలు జాపి ఆ వగుడాకుల్ని, చొప్పదంట్లను అందుకోటానికి గింజుకున్నాయి.

వలపటెద్దు అంకేసుకుంది. బండి నొగల్లో కూచొని వున్న పుల్లారెడ్డి యెద్దుల అవస్తను చూశాడు. కడుపు తరుక్కుపోయింది. బండి ఆపి, పగ్గాలు నొటుకు కట్టి నగలు దిగాడు. కాడి సరిచేశాడు.

దారిలోని ఆ వగుడాకుల్ని, చొప్పదంట్లనూ యేరి యిసుక విదిలించాడు. యెద్దుల నోటికి ఆప్యాయంగా అందించి, మళ్ళీ నొగలెక్కి యెద్దుల్ని అదిలించాడు.

అవి నములుతూ, వంకలోని యిసుక దిబ్బలమీద అడ్డదిడ్డంగా పెరిగిన చీకిచెట్లను (సర్కారు తుమ్మకంప చెట్లను) యే గడ్డో అనుకొని ఆశగా చూస్తూ, బండిని లాగుతూనే వున్నాయి

యెండ. ఆకు అల్లాడలేదు. చొక్కా తొడుక్కోని పైనిండా చెమట్లు. పుల్లారెడ్డి ఆకాశం దిక్కు చూశాడు. ఒక మబ్బుతునక లేదు. పెద్దోళ్ళ వాగ్దానంలా వుంది ఆకాశం. నాలుగు దిక్కులూ కలయ చూశాడు. వానకోసం యెదురు చూసే రైతులా వుంది వంక. మొండిజాతి కంప మొక్కలు పెరిగిన గట్లతో, బీడైన రేగటి చేలు. ఎవరో గుండెను ముక్కలు చేసి కడ్డీలకు చెక్కి, మంటల్లో మాడ్చి మసి బొగ్గులు చేసినట్లుండే రేగటిచాళ్ళు. ఇంకాస్త ముందు, వూరి ముందర కళ్ళాలు. రెండు మూడు కళ్ళాల్లో యే రెండు బారల చొప్పవాములో, పొట్టు వాములో తప్పితే అన్నీ దాదాపు మొండి గోడల కళ్ళాలే - కాస్తా కందికట్టెతోనో, పత్తి కట్టెతోనో, మొండి బ్రతుకుల్లా వున్నాయి.

పుల్లారెడ్డి మనసులో కరువు కాలం తిరిగింది;

'యీ పాడు కరువు అందర్నీ మాడ్చి మసిచేస్తోంది. రయితులకు ఇంట్లో గింజల్లేవు. వీధుల్లో పరపతుల్లేవు. పశువులకు కళ్ళాల్లో మేత లేదు. యే కొండ గడ్డీ లేదు. పెద్దోళ్ళు దాత కరువని యేదో చెప్తారు. కాని యింత కరువు - పశువులకు గాట్లో యింత మేతలేని చెడ్డ కరువు-తనింతవరకు చూళ్ళేదు. వూళ్ళో కలిగిన అయిదారిండ్లవాళ్ళు తప్పిస్తే, చిన్నా చితకా రయితులు మేత దొరక్క, కన్న బిడ్డల్లాంటి యెద్దుల్ని, కాండ్లకు కాండ్లే పులివెందుల సంతకు తోలి, అయిన కాడికి తెగనమ్మి వచ్చినారు. లారీలకు లారీలు నోరులేని యెద్దుల్ని యేసుకొని, బెంగుళూరు కంట పోతాంటే తనొక సంతరోజు చూసినాడు. పల్లెల్లో ముప్పయి నలభై కాండ్లు అమ్మినారంట! ఆ రోజు మూడువేలు చేసే యెద్దుల్ని వెయ్యికి కళ్ళంలో నారాయుడు అమ్మలేదా? యేడుస్తా కూకోలేదా? తను మాత్తరం యీ కాడెద్దుల్ని నిలబెట్టుకోడానికి పాడి గేదెల్ని అమ్మలేదా? ప్రెసిడెంటు బిడి పని పెట్టుకోబట్టి కానీ లేకపోతే యీ యెద్దులు, బండి నిల్చేవా? తను, అమ్మా బతకడమే చావయితే! తన రెండెకరాలు, పైర్ల బండికి తెచ్చిన అప్పుకిందనే వుంది. యెంత బాడుగలు తోలినా కడుపునిండా సంగటీ సారకాలేదు. గాటినిండా మేతాలేదు.'

బండి వూరిదగ్గర కొచ్చింది. యెటు చూసినా చీకిచెట్లే. వాటిని చూసి పుల్లారెడ్డికి కోపం రగిలింది. ఆ మధ్య పుల్లారెడ్డికి చీకిముళ్ళిరిగింది. కిరసనాయిలు, చీకిఆకు వైద్యం చేసుకున్నా బాధ తగ్గలేదు. నెలరోజులు నానాయాతనా పడ్డాడు. అది గుర్తుకొచ్చింది. వాటిని చూస్తూ అసహ్యించుకున్నాడు:

'వేటికి కరువొచ్చినా వీటికి మాత్రం కరువు లేదు. బావుల్లో నీళ్ళింకి పోతున్నా, పచ్చగడ్డి అనేదే కంటికి కనిపిచ్చక పోయినా ఈ చీకిచెట్లు మాత్రం యే పాతాళంనుంచి నీళ్ళు తాగుతాయేమో, పచ్చగా వుంటాయి – చీకిముళ్ళల్లో – గూనిశెట్టి తిన్న, కరణం తిన్న, వూళ్ళో పోలీసోళ్ళు తిన్న, సీమపంది పశువుల డాక్టరు తిన్న...దీంట్లతోనే కరువులంట! థూ... మీ యమ్మ...'

—పుల్లారెడ్డి కేకరించి యెంగిలి వూశాడు.

అటు పక్కనే పోతున్న గొల్లబోయడు "యేందోయ్ అల్లుడా! సూసి ముయ్యి. మనుసుల్నడిసే దారనుకున్నావా? జీవాల్నడిసే అడివనుకున్నావా?" అంటూ మందలించాడు.

"పొరపాటయిందేలే మామా" అంటూ పుల్లారెడ్డి ఎడ్లను అదిలించాడు.

బండి పక్కన్నే నడుస్తూ, గొల్లబోయ దన్నాడు:

"నువ్వే మేలోయ్ అల్లుడా, యీ కాలానికి. వూళ్ళో రయితులు కాండ్లకు కాండ్లమ్ముకున్నారు. పది గుంపులోళ్ళం గొర్లమ్ముకున్నాం. నువ్వు మాత్తరం నీ బండెద్దులూ బండీ యిడసలా, యెట్లో వొకట్ల."

"ఆ అందుకే నేనింత తిని బలిసినా. యెద్దుల్ని చూడు, జొల్లెడు పొట్టుకు మొగంవాసి ఆర్నెల్లయింది."

"పుటికె మేతవెయ్యి అల్లుడా! నీకేమయింది? పెండ్లామా, బిడ్డలా?"

గొల్లబోయని పరిహాసానికి పుల్లారెడ్డికి కోపం రాలేదు. నవ్వుతూనే అన్నాడు:

"ఈ కరువుల బతుక్కుతోడు పెండ్లా? అయినా గొడ్లు కాసినంత సులబం కాదులే, యెద్దులు మేపడమంటే! నీకేం చెప్తావు. మా అమ్మా, నేనూ ఈ కరువులో యేం తినమంటావు?"

గొర్లబోయనికి ఆ ప్రశ్నకుండే సమాధానం తెలుసు. తెచ్చుకోలు వుత్సాహంతో అన్నాడు:

"మర్చిపోయినానోయ్ అల్లుడా, గవర్నమెంటోళ్ళు వ్యాగన్లకు వ్యాగన్లు వరిగడ్డిని దించుతాండారంట! ముద్దనూరు టేషన్లో సూసినోళ్ళన్నారు – అబ్బ టేషన్ సుట్టు మల్యాల కొండల్లా గడ్డివాములే నంట! మా సుట్టాల పల్లెలకు లారీలకు లారీలు వరిగడ్డి వచ్చిందంట! మన పల్లెలకూ వస్తాదంట, ఈ పొద్దో రేపో! సగం రేటుకే యిస్తారంట! సబ్సిడి కూడా అంటున్నారు. కాడికిన్ని కట్టలని యిస్తారంట! యింకేం ఫరవాలేదులే, రయితులకు. నాకు మిగిలిన ఆ వొక్క గొర్రెపిల్లకు కాలిరిగింటే పశులాస్పత్రికి పోయినా... అక్కడా సెప్పినారు గడ్డి కత."

– ఈ శుభవార్త చెప్పి గొల్లబోయడు తన దారిన తాను వెళ్ళిపోయాడు.

పుల్లారెడ్డికి ఈ వార్త అదునుకు వానబడినంత ఆనందాన్నిచ్చింది. యెంత గడ్డి యిస్తారో, యెంత కొనాలో, యెంత కొనవచ్చో, యెంత అప్పు చేయవలసి వుంటుందో, అప్పు యెక్కడ చేయాలో అన్న ఆలోచనలు పుల్లారెడ్డిని ముసురు కున్నాయి.

సమయానికి ఆదుకోలేకపోతేనేం, యిప్పటికయినా గడ్డి దించుతున్నందుకు 'గవర్నమెంటోన్ని' పుల్లారెడ్డి మెచ్చుకున్నాడు. తన యెద్దులకు కడుపునిండా మేత దొరికితే వూరే బతికిపోతాదని అనుకున్నాడు.

ఉత్సాహంగా యెద్దుల్ని అదిలించాడు. బడి దగ్గర రాళ్ళ బండి దించాడు. అక్కడే వున్న ప్రెసిడెంటు, దించిన రాళ్ళవైపు చూస్తూ అన్నాడు :

"యేరా! మరీ అన్యాయమయి పోతండావు. లెక్కేసుకొని రాళ్ళేసు కొస్తండావా? యిట్లయితే నేను గొరిగించుకోవల్సిందే. యేదో పది మంది పని అని అందరూ మొత్తుకుంటే, కరువు కాలంలో నెత్తి నేసుకున్నా, ఈ కంట్రాక్టు..."

పుల్లారెడ్డి నవ్వుతూనే సమాధానమిచ్చాడు :

"అదికాదు చిన్నాయనా! నువ్వు చూస్తాండావు యెద్దుల పాట్లు. ఒక బండెడు మేపు యీ. నువ్వు చెప్పినట్లే రాళ్ళేసుకొస్తా."

ప్రెసిడెంటుకు మేపు అడిగే వేళకు చిరాకేసింది. ఘోష పెట్టాడు :

"అవురా ! మిగిలిన ఆ నాలుగు బారల వామి చూస్తే అందరూ పరాచి కాలే ఆడతారు. వూళ్ళో అంతా గింజలకూ నా మీదే; మేపుకూ నా మీదే. యాభై మైళ్ళదూరం నుంచి ఆ మేపు వేసుకొనొచ్చింది నీకు తెల్సుకదా – మా చెన్నూరు సహుగుడు మంచి దంటే. యెంత ప్రెసిడెంటు నయితే మాత్రం వోట్లప్పుడూ ముండమొయ్యించి, యిట్లాంటప్పుడు ముండమొయ్యించడమేనా, అంతా? రేపో, మర్నాడో వరిగడ్డి వస్తోంది. నేనే పైన మాట్లాడినా. మీ యమ్మ దగ్గరున్న ఆ ముల్లె విప్పి బండెడు గడ్డికొని యెద్దులకు వేసుకో. అయినా ఈ యెరువు వేసిన గడ్డి మన చొప్పకూ, చెనిక్కాయ పొట్టుకు తగ్గే ననుకో. అయితే యేం జెయ్యాల...?"

పుల్లారెడ్డి బదులేమీ చెప్పలేదు. నవ్వేశాడు. వస్తుంది వస్తుందన్న వరిగడ్డి వారం పది రోజుల వరకూ రాలేదు. ఒక శుభోదయాన ఒక లారీ వచ్చింది. పశువులాస్పత్రి ఆవరణలో గడ్డి దిగింది. గడ్డి వ్యవహారం తెలుసుకోటానికి వచ్చి పోయే రయితులతో, తమషా చూసేవాళ్ళతో, పశువులాస్పత్రి జన్మానికి శివరాత్రిలా కళకళలాడింది. గంగను వెంటబెట్టుకొని వచ్చిన అపర భగీరథునిలా వెటర్నరీ డాక్టరు. డాక్టరు సుబ్బిరెడ్డి పరమోత్సాహంతో కన్పిస్తున్నాడు. ఒకటి రెండు రోజుల్లో మరో రెండు లారీల గడ్డి వస్తుందని, వూరు వూరందరికీ పంచవచ్చునని సుబ్బిరెడ్డి హామీలు యిచ్చాడు. మరొక లారీ గడ్డి వచ్చింది.

యిళ్ళల్లో వున్న గొడ్డూ గోదాను రక్షించుకోవటానికి మేత కావాలి. అందుకు డబ్బు కావాలి. సమయానికి చేతుల్లో డబ్బుల్లేని రయితులు అప్పులకోసం తారాడటం మొదలుపెట్టారు. యిళ్ళు గడవటానికి తారాడాలి. పశువుల మేతకోసం తారాడాలి. కరువులో తారాడటం తప్పదు.

గడ్డిపంపకం రోజు పుల్లారెడ్డికి పక్కవూళ్ళో యేదో బాడుగ తగిలింది. పోతూ పోతూ తల్లి అచ్చమ్మకు చెప్పాడు :

"అమ్మా! మన పేరూ రాసుకున్నారు. జొన్నల మూటె కొనడానికి దాచి పెట్టిన బండి బాడిగెల బాపతు న్నూరుపాయలు తీసకపో. ముందు గడ్డితెస్తే, ఆ మల్ల మన అవస్తలు మనం పడదాం."

అచ్చమ్మ "సరే"నంది.

ఆ రోజే తమ చేలో రాళ్ళేరటానికి అచ్చమ్మను ప్రెసిడెంటు కూలికి పిలిపించాడు. కూలెందుకు చేటు చేసుకోవాలని అచ్చమ్మ కూలికి వెళ్ళింది—'పేరు రాసుకున్నాక గడ్డి యివ్వకపోతారా? యాడకి పోతాది ?' అనుకుంటూ. చేలో రాళ్ళేరుతున్నా, ధ్యాసంతా వరిగడ్డి తెచ్చుకోవటం మీదే వుంది. సరిగ్గా మేతలేక రోజురోజుకు తగ్గిపోతున్న యెద్దుల్ని తలచుకొంటుంటే అచ్చమ్మ మనసు దిగులుతో నిండిపోయింది.

కూలిపొద్దు ముగిసి, కూలిని చేతికందుకుందో లేదో, ఆదరాబాదరా యింటికి వెళ్ళి దాచిన డబ్బు వంద బొడ్లో దోపుకుంది. పశువులాస్పత్రికి వెళ్ళింది.

ఆస్పత్రి ముందు అక్కడక్కడ నాలుగు గడ్డిపరకలు కనిపిస్తున్నాయి. ఆస్పత్రి తెరిచేవుంది. బయట యెవరూ లేరు. అచ్చమ్మకు అంతా అయోమయంగా కన్పించింది, మాయగా కన్పించింది. గుండె దడదడలతో ఆస్పత్రి గదిలోకి వెళ్ళింది.

ఆస్పత్రి గదిలో డాక్టర్ సుబ్బిరెడ్డి కుర్చీలో కూచొని, తాపీగా సిగరెట్టు తాగుతూ, వరిగడ్డిలో తనకెంత మిగులుతుందో లెక్కలు వేసుకుంటున్నాడు. ఒక కట్టను రెండు కట్టలుచేసి, లారీ బాడుగలు, తను గడ్డికోసం తిరిగిన పై ఖర్చులు కలుపుకొని అమ్మిన అంకెలు పచ్చగా కనిపిస్తున్నాయి.

'పల్లెటూళ్ళో వుద్యోగంలో చేరింది మొదలు ఇంత డబ్బు ఒక్కసారి కళ్ళకు చూసిందిలేదు. మందు లమ్మితే ఎంత మిగిలిచస్తుంది? పైగా కాంపౌండరు గిల్లుకుంటాడు. ఆస్పత్రి కింద వుండే వూళ్ళు పెద్దవనీ, మేత చాలదనీ మరో పది లారీలు వరిగడ్డిని యెట్లయినా పై అధికారుల్ని పట్టుకొని సంపాదించాలి. లేకపోతే ప్రెసిడెంటు రెడ్డిని యెగదోయాలి...వాళ్ళకు కావలసినంత గడ్డి దొరికింది కదా, ముందు కెందుకు రారు?'

అచ్చమ్మ సుబ్బిరెడ్డి ముందుకు వచ్చి నిలబడి అమాయకంగా అడిగింది:

"వరిగడ్డి యాడబెట్టినారు డాక తేరు నాయనా? మా కిచ్చే కట్టలిప్పిస్తే యింటికి తోసకపోతా."

సుబ్బిరెడ్డి చావుకబురు చల్లగా చెప్పాడు:

"అయిపోయిందవ్వా. మళ్ళా వస్తాదిలే."

"పొద్దున్నే అంత వరిగడ్డిని సూస్తినే నాయనా? అప్పుడే అయిపోయిందా? యింట్లో రెండు సొప్పకట్టలు కూడా లేవు నాయనా. మా వాడొస్తే నా మీదెగురు తాడు-ముందే యెందుకు తెచ్చి యింట్లో పడెయ్యలేదని. నీకు తెల్సుకదా, ఆ యెద్దులు బండీ లేకపోతే మాకు గడవదని? పాడెనుముల్ని కూడా గూనిశెట్టి కమ్మి, కడుపు గట్టుకొని ఈ యెద్దుల్ని సూసుకుంటున్నాం నాయనా."

అచ్చమ్మ గోడు విని సుబ్బిరెడ్డికి క్షణం అయ్యో అనిపించింది. "యీమా రొస్తే యిస్తాలే" అంటూ, ఏదో పుస్తకం చదువుతున్నట్లు ముఖానికి అడ్డం పెట్టు కున్నాడు.

అచ్చమ్మ గుప్పెట్లో పట్టుకున్న వందరూపాయలను మళ్ళీ బొడ్లో జాగ్ర త్తగా దోపుకుంది. గొణుక్కుంటూ ఇంటివైపు బయలుదేరింది. అచ్చమ్మకు యేం చేయాలో తోచలేదు.

దారిలో పోతూ పోతూ ప్రెసిడెంటు కళ్ళం, మరో నలుగురయిదుగురు పెద్ద రయితుల కళ్ళాలవైపు చూసింది. ఆ కళ్ళాల్లో బండ్లకు బండ్ల వరిగడ్డి. అనుమానం వచ్చి గూనిశెట్టి కళ్ళం చూసింది, ప్రెసిడెంటు కళ్ళం చూసింది. కరణం కళ్ళం చూసింది. వూళ్ళో పెద్ద ఆసాముల కళ్ళాల్లో అప్పుడే గడ్డివాములు లేస్తున్నాయి. అచ్చమ్మ కడుపు రగిలింది.

'ఇంట్లో అట్టమీద మేపు లేదు. గాట్లో పొయ్యిలోకి పనికివచ్చే వట్టిదంట్లు తప్ప మరే చొప్పా లేదు. కడుపునిండా మేతలేని యెద్దులు. అవే కుంటుపడితే?' అచ్చమ్మ కడుపు తరుక్కుపోయింది.

జరిగిపోయిన అన్యాయం తలంచుకొంటూంటే, అచ్చమ్మ రక్తం వుడికిపో యింది. పశువుల డాక్టరుమీద పీకలదాకా కోపం వచ్చింది. ఆ ఆవేశంలో వడివడిగా ఆస్పత్రి వైపు నడిచింది.

నడుస్తూంటే బతుకంతా బుగ్గి చేసిన పాడురోజులు మనసులో గింగిర్లు తిరుగుతున్నాయి. వానల్లేక, పైర్లులేక, బావుల్లో నీళ్ళులేక, బావికింద తోటల్లేక, యింట్లో కూడబెట్టిన లప్పల్లేక, కేవలం సంసారం జరుగుబాటు కోసం, నలుగురాడ పిల్లల పెళ్ళిళ్ళ కోసం, వ్యవసాయం ఖర్చుల కోసం, మామ హయాంలో పోయిన ఆస్తి అచ్చమ్మకు జ్ఞాపకానికి వచ్చింది. ముతక పంచలు నాలుగు, కోరా సైను చొక్కాలు రెండు తప్ప, రోజూకాక బీడీల కట్ట తప్ప, యెప్పుడన్నా కూరానారా చేసినప్పుడు ఒక్క అణా ఆకులు తప్ప ఏ సుఖమూ అనుభవించని మగడు జ్ఞాప

కానికి వచ్చాడు. జరుగుబాటు కోసం రెక్కలు ముక్కలు చేసుకునే కొడుకు, పై పూరికి పోతే తప్ప, చొక్కా కూడా వేసుకోలేని కొడుకు జ్ఞాపకానికొచ్చాడు. కొడుకు పెళ్ళిచేద్దామనుకున్నా కరువు అడ్డమొచ్చిన సంగతి తలపు కొచ్చింది. తీరని బాకీలూ, డొక్కలార్చుకొని పోయిన యెద్దులూ జ్ఞాపకాని కొచ్చాయి. కలిగినోళ్ళ యెద్దులకు కావలసినంత మేత, తమ యెద్దులకు మాత్రం మేత లేదనుకుంది.

అచ్చమ్మలో నిర్వేదం, కోపం, దుఃఖం గిజిగాని గూడులా అల్లుకున్నాయి. మధ్యదారిలోనే సుబ్బిరెడ్డి యెదురయ్యాడు. అచ్చమ్మ ఆక్రోశం ఆపుకోలేకపోయింది. ఛ్రమని లేచింది:

"నా బట్టా! నువ్వు రైతు కొంపల్లోనే పుట్టినావా? కాపోడివేనా? యింత కలి కాలమా? మేం మనుసులం కాదా? పెశిలెంటు, గూన్సెట్టి, పెద్దిండ్లోళ్లేనా మనుసులు? మాది లెక్క కాదా? నువ్వు నోటికి తినేది కూడా, గడ్డా? యిత్నామిత్నామని రాసు కొని యిట్లా చేస్తావా? గడ్డీ కాన్నే యింత వలపక్రమా? యెద్దుల నోరు కొట్టినావు. మా నోరు కొట్టినావు. నీకేం పొయ్యేకాలం? దూము తగలా!"

అచ్చమ్మ అరుపులకి వీధిలో, యిళ్ళపంచల్లోని అరుగులమీద కూచున్న చిన్న రయితులు లేచి మూగారు. చంకల్లో పిల్లల్ని వేసుకొని ఆదరాబదరా జుట్టు ముడేసుకుంటూ, చేతుల్లో వున్న పనులొదిలి యిళ్ళల్లోని ఆడవాళ్ళు బయటికి వచ్చారు. పిల్లలు చోద్యంగా చూస్తున్నారు. కుర్రకారుకు సంబరంగా వుంది. చాలా మంది గుండెల్లోంచి పైకుబకని భాషనే అచ్చమ్మ మాట్లాడుతోంది. గడ్డి కొందా మన్నా డబ్బుల్లేని వాళ్ళు, నాలుగు వరిగడ్డి కట్టలేవో చేతికందిన వాళ్ళు, ఖాళీ చేతులతో వచ్చినవాళ్ళు, పశువుల వైద్య మప్పుడు కోళ్ళు, కుక్కలు యిచ్చిన వాళ్ళ 'నా కొడుకును బాగా తిడ్తాంది ముసల్ది' అనుకున్నారు. డెబ్భై యేళ్ళపైబడి, గూని వేసుకుంటూ పనీపాటలకు పోయే ఆ ముసలామెలో అంత శక్తి ఎక్కడుందో అందరికీ ఆశ్చర్యంగా వుంది.

డాక్టరు సుబ్బిరెడ్డికి ఒళ్ళంతా జెర్రులు పాకినట్లయింది. చెమటలు పట్టాయి. చేతిగుడ్డతో అదేపనిగా ముఖం తుడుచుకుంటూ ప్రెసిడెంటు యింటివైపు దాదాపు పరుగులు తీశాడు. స్టేషన్లో సబిన్స్పెక్టర్ వున్నాడో, లేడో అన్న ఆలోచన ఆ స్థితిలో కూడా వచ్చింది.

'ముసలిదానికున్న ధైర్యం మనకు లేదు' అని వీధిలోని రయితులు మధన పడ్డారు. ప్రెసిడెంటుమీద పార్టీ కట్టడానికి మంచి అదునిది అనుకుంటున్నారు కొంతమంది.

అచ్చమ్మ శపించి, శపించి చుట్టూ చూస్తున్న వాళ్ళ వైపు తిరిగి యెంగిలి మూస్తూ తిట్టింది:

"ముండ నా బట్టశ్శాల్లా. ఛూ ఒక్క నా బట్ట యిది అన్యాయం అనడు. యిది పూరా వల్లకాడా ?"

అచ్చమ్మ తిట్టి తిట్టి గొంతు బొంగురుపోయింది.

అక్కడ వూరికి రెండు మైళ్ళ దూరంలో, గతుకుల బండ్లబాటలో, డొక్క లాడ్చుకొనిపోయిన బడెద్దులు ఖాళీ బండిని నీరసంగా లాగుతూనే వున్నాయి, బాడుగకు పోయిన వూళ్ళో దొరికిన కాస్తా మేపు తిని నెమరేస్తూ.

వూరు చేరాలనే తొందరలో పుల్లారెడ్డి పైనా కిందా కలయ చూశాడు.

ఆకాశంలో చావని ఆశలాగా రెండు మబ్బుతునకలు. రయితుల గుండెల్లో రేగడి చేలు. ఈసారి కరువు రాదు అనుకుంటున్నాడెందుకో! నిన్న మొన్న పశువులాస్పత్రి ఆవరణలో చూసిన వరిగడ్డి కొండల్ని తన కళ్ళంలో, అటవమీదా, గాట్లో వూహించుకుంటున్నాడు.

ఆ సంతృప్తికరమైన వూహల్లో తేలిపోతూ, చేలకోల గాలిలో ఝుళిపించి కాడిపైన విసిరాడు. చేలకోలను బండి పరంపై పడేసి, దాపటెద్దు మూపు చరచి 'ఠఠ పప' అంటూ వుత్సాహంగా రిక్కలేసి యెద్దులను హెచ్చరించాడు.

"ఠఠ పప...తొందరగా నడ్వండి. ఈ పొద్దు గాటినిండా మేతే..."

ఇక్కడ వూళ్ళో, అచ్చమ్మ ఎగదోసిన మంట రయితుల్లో రగులుతోంది, కన్పించీ కన్పించకుండా.

○ నవంబరు 1981, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక